క్లుప్తంగా

ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం



ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన నాయకులు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి అరుణోదయ యువజన సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన జూలకంటి పాండురంగారెడ్డి సోమవారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. 6వ తేదీన అరుణోదయ యువజన సంఘం అధ్యక్షుడిగా పాండురంగారెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తున్నందున కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాలని ఎంపీని ఆహ్వానించారు. కాగా, మండలస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు వై ప్రకాష్ గుప్త, గోపాల్‌రెడ్డి, సాత ప్రవీణ్‌కుమార్, బాలక్రిష్ణ, ప్రణీత్‌కుమార్, రాంపాల్, సంజీవ్‌కుమార్, రాకుమార్, రఘునందన్‌రెడ్డి ఉన్నారు.

నైపుణ్యంతో మంచి అవకాశాలు

ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి



వేడుకల్లో విద్యార్థులతో ప్రిన్సిపాల్

మొయినాబాద్: ఎంబీఏ విద్యార్థులు నైపుణ్యం పెంచుకుంటే మంచి అవకాశాలు లభిస్తాయని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో 2021–23 బ్యాచ్ ఎంబీఏ విద్యార్థులు సోమవారం సిగ్నిచర్ డే వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు సమయం వృథా చేయకుండా నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. వచ్చిన అవకాశాలను జారవిడుచుకోకుండా అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



గెలుపొందిన జట్టుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

కేశంపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కేశంపేట సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ స్థాయి నుంచి విద్యార్థులు క్రీడల్లో రాణించాలనే లక్ష్యంతో మండలస్థాయిలో క్రీడాపోటీలను నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జట్లకు సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జోనల్ స్థాయిలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు షాద్‌నగర్ నియోజకవర్గంలోని కేశంపేట, కొత్తూర్, నందిగామ, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, చౌదరిగూడ మండలాల నుంచి పలు జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను కేశంపేట సర్పంచ్ వెంకటరెడ్డి పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. వాలీబాల్ (అండర్ 14) బాలురు విభాగం, (అండర్ 17) బాలికల విభాగంలో, (అండర్ 17) బాలుర విభాగంలో గెలుపొందిన జట్లకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీడీలు రాజశేఖర్‌రెడ్డి, యాదయ్య, నిర్మల, పీఈటీలు మెజ్కెల్, మహిపాల్, బాలయ్య, కృష్ణారెడ్డి, శ్రీలత, మోనాలిసా, పుణ్యవతి, పాండు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్

షాద్‌నగర్: అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీలు సీఐటీయూ, అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ పార్థసారథికి సమ్మె నోటీసు అందజేశారు. శ్రీనునాయక్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తిసూ ప్రకటించినా సర్క్యులర్‌ను వెంటనే జారీ చేయా లని డిమాండ్ చేశారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, 'ఆరోగ్యలక్ష్మి' కింద పిల్లలకు మెనూ చార్జీలను పెంచాలని, హెల్త్ కార్డు లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగజ్యోతి, పుష్ప, రేణుక, నిర్మల, కవిత, శరత్ పాల్గొన్నారు.

చిగురించిన ఆశలు

- ఆరుతడి పంటలకు జీవం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

షాబాద్: గత నెల రోజులుగా వర్షాలు లేక రైతులు తీవ్ర ఆందోళన చెందారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో పంటలకు ఉపశమనం లభించినట్లయ్యింది. ఎండుముఖం పట్టిన కంది, మొక్కజొన్న, క్యారేట్, పత్తి పంటలు జీవం పోసుకున్నాయి. ఆరుతడి పంటలు వేసిన రైతులు సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం కురిసిన ఎడతెరిపిలేని వర్షానికి మండలంలోని షాబాద్, చందనవెల్లి చెరువులు, ఈసీవాగు, ఎర్రవల్లి, తాళ్లపల్లి, నాగర్‌గూడ వాగులు ప్రవహిస్తున్నాయి.



షాబాద్ : అంతారంలో జీవంపోసుకున్న పత్తి పంట

ఈసీవాగు పరవళ్లు

షాబాద్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఈసీవాగు పరవళ్లు తొక్కుతోంది. కుండపోత వర్షానికి ఈసీవాగు పొంగిపొర్లతోంది. మండలంలోని నాగరగూడ, తిమ్మారెడ్డిగూడ, ఎర్రవల్లి, తాళ్లపల్లి, నరెడ్లగూడ, చర్లగూడ, మక్తగూడ, హైతాబాద్, సోలీపేట్ గ్రామాల సరిహద్దు నుంచి వెళ్లే ఈ వాగులోకి నీళ్లు రావడంతో రైతుల్లో ఆనందం వెల్లి విరిసింది. బోరుబావుల్లోకి పుష్కలంగా నీరు చేరుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ముసురేసిన వర్షం

మొయినాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం రోజంతా ముసురువర్షం కురిసింది. మొయినాబాద్ మండల కేంద్రంతో పాటు పెద్దమంగళారం, చిలుకూరు, చందానగర్, అప్పోజీగూడ, రెడ్డిపల్లి, మేడిపల్లి, సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్, నాగిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు వర్షం పడుతూనే ఉండటంతో పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు, పనుల కోసం వెళ్లేవారు, ఉద్యోగులు, ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై పలు చోట్ల వర్షం నీరు నిల్వడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వర్షంతో వణుకు

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో కురుస్తున్న వర్షానికి వాతావరణం చల్లబడింది. సోమవారం సూర్యుడు ఉదయించకపోవడంతో ఆకాశమంతా మబ్బులు కమ్ముకున్నాయి. వర్షానికి రోడ్ల న్నీ జలమయమ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. గ్రామాల్లోని రోడ్లు అక్కడక్కడ జనం తప్ప రోడ్లన్ని నిర్మాణుష్యంగా మారాయి. ఇంకా 3–4 రోజులు ఉన్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

చేవెళ్లలో 2.6సెం.మీ. వర్షపాతం

చేవెళ్ల: మండలంలో ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఉదయం నుంచి వర్షం ఏకదాటిగా వస్తుండటంతో ప్రజలు ఇళ్లనుంచి బయటకు రాలేదు. అత్యవసరమైన వారు మాత్రమే రోడ్లపై కనిపించారు. మండలంలో 2.6సెం. మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ నక్షత్రం జీవంతు అన్నారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు చలికి వణుకుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ.. వర్షాల దృష్ట్యా ప్రజలు శిధిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండొద్దని సూచించారు. వర్షాల వల్ల నష్టం జరిగే అవకాశం ఉందని తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అధికారులు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని తెలిపారు.

–ఎంపీపీ నక్షత్రం జీవంతు



షాబాద్: తాళ్లపల్లి వద్ద నిండుగా ప్రవహిస్తున్న ఈసీవాగు



మొయినాబాద్: స్కూటీపై గొడుగు పట్టుకుని వెళ్తున్న వ్యక్తులు



హిమాయత్‌నగర్ చౌరస్తాలో కురిసిన వర్షానికి రహదారిపై నిలిచిన నీరు



చేవెళ్లలో ఎడతెరిపి లేని వర్షం

పేదల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: నిరుపేదల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. సోమవారం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన చికిత్సలు అందజేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల స్థాయిని పెంచి నూతన ఆస్పత్రులను ప్రభుత్వం నిర్మిస్తుందని తెలిపారు. గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయడమే కాకుండా మాతా శిశు సంరక్షణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని వివరించారు. నూతనంగా మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయడమే కాకుండా వైద్యులను ప్రభుత్వం తయారు చేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా పట్టణంలోని రైతు కాలనీకి చెందిన భీంమేంద్రకుమార్ వర్మకు రూ. 50.500, గాంధీనగర్ కాలనీకి చెందిన మోహన్‌రెడ్డికి రూ.60వేలు, భాగ్యనగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్‌గౌడ్‌కు రూ.50వేలు, అమీనా కౌసర్‌కు రూ.60వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, విశ్వం, యుగేందర్, జమృద్‌ఖాన్, చీపిరి రవియాదవ్, సర్వర్‌పాషా, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

మాదాసి కురువ సంఘం అధ్యక్షుడు వితలయ్య



తహసీల్దార్‌కు వినతి ప్రతం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: మాదాసి కురువలకు ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఆ సంఘం తాలూకా అధ్యక్షుడు సింధం వితలయ్య డిమాండ్ చేశారు. సోమవారం సంఘం నాయకులు ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వితలయ్య మాట్లాడుతూ.. మాదాసి కురువల ఆర్థిక, సామాజిక, రాజకీయ విద్యా రంగాల్లో నేటికి వెనకబడే ఉన్నారని అన్నారు. ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే 1768 జీఓను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మక్తగూడ నూతన గ్రామకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాట్న శ్రీను, ఉపాధ్యక్షుడిగా బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా రాజు, సంయుక్త కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా శ్రీరాములు, గౌరవాధ్యక్షుడిగా రాజు, కృష్ణ, విఠల్, రమేష్,లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శివరాములు, సత్తయ్య, బీరప్ప, వెంకటేష్, రాజు, అర్జున్, మోటి శ్రీను ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై ఒత్తిడి తేవాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చేవెళ్ల: ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేయాలని మహాజన్ సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ)ని యోజకవర్గం ఇన్‌చార్జి శంకర్‌రావుమాదిగ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కాడిగల్ల ప్రవీణ్‌కుమార్ మాదిగలు పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ఎస్సీ రిజర్వేషన్ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చే బాధ్యతను తీసుకోవాలని కోరారు. దీనికి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ముఖ్యమంత్రికి చెప్పాలని ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉండాలని కోరారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మండల ప్రధాన కార్యదర్శి శివకుమార్, చేవెళ్ల మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, మొయినాబాద్ మండల కన్వీనర్ మహేందర్, వికారాబాద్ జిల్లా ఎంఎస్‌పీ కో కన్వీనర్ రవికుమార్, భానుప్రసాద్, నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాస్, మహేందర్, మల్లికార్జున్, శేఖర్, పవన్, తదితరులు ఉన్నారు.

పోలీస్ అధికారిపై చర్యలు తీసుకోవాలి

శంకర్‌పల్లి: మోకిలలోని ఎస్సీ కాలనీలో ప్లాట్లు కబ్జా చేస్తున్న పోలీసు అధికారిపై చర్యలు తీసుకోవాలని మోకిల ఎస్సీకాలనీ వాసులు సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 31లో 5ఎకరాల 6గంటల భూమి నగరానికి చెందిన సయ్యద్ మిర్జా ఆధీనంలో ప్రభుత్వ భూమి ఉండగా గ్రామపెద్దలు, తాము ఆయనను ఒప్పించి 35సంవత్సరాల క్రితం భూమిని తీసుకొని లేఅవుట్‌గా మార్చుకున్నామని తెలిపారు. ఒక్కో కుటుబానికి 110గజాల చొప్పున కేటాయించడం జరిగిందని చెప్పారు. కాగా, లేఅవుట్‌లోని ప్లాట్లను ఎస్సీ కుటుంబాలకు కేటాయించగా కొన్ని ప్లాట్లు మిగిలాయి. గ్రామానికి చెందిన చిట్టంపల్లి సామయ్య పోలీసు శాఖలో ఉన్నతాధికారిగా ఉంటూ ఎస్సీ కాలనీలోని ప్లాట్లకు నకిలీ పత్రాలను సృష్టించి కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మోకిల పోలీసులు సైతం ఆయన చేసిందే న్యాయమని వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫరీద్, నాయకులు లింగం ముదిరాజ్, గోపాల్‌చారి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


షాద్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కిషన్‌నగర్‌కు చెందిన నవీన్ శంషాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్ నవీన్‌ను పరామర్శించారు. చికిత్స నిమిత్తం రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

అక్షర సూర్యులు

జిల్లాస్థాయి పురస్కారాలకు ఉపాధ్యాయుల ఎంపిక

షాద్‌నగర్: విధుల్లో చిత్తశుద్ధి.. బోధనలో వైవిధ్యం చూపారు.. పాఠశాల అభివృద్ధిపై తల్లిదండ్రులకు అవగాహన పెంచారు. గ్రామస్తుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు దాతలను ప్రోత్సహించారు. ఇంటింటికి తిరిగి విద్యార్థుల సంఖ్యను పెంచి బడిని బలోపేతం చేశారు. విద్యార్థులకు అర్థం అయ్యే రీతిలో పాఠాలు బోధించి ఉత్తమ ఫలితాలు రాబట్టి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారు. వారు చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసింది.

ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు



కృష్ణకుమారి

షాబాద్ : మండలంలోని ఐదుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారని మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాబాద్ బాలుర ఉన్న పాఠశాల హిందీ భాషోపాధ్యాయులు సరోజ, బి.విమల తెలుగు పండిత్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల హైతాబాద్, జయశ్రీ ఎస్‌జీటీ హైతాబాద్ ప్రాథమిక పాఠశాల, మాలతి ఎస్‌జీటీ షాబాద్ ప్రాథమిక పాఠశాల, కృష్ణకుమారి కేజీబీవీ పాఠశాల షాబాద్, డాక్టర్ వి.వాచ తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ జిల్లా ఉత్తమ అవార్డులు అందుకోనున్నారు. ఈ సందర్భంగా సాక్షి వారిని పలకరించగా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాప్రమాణాలను పెంచేందుకు కృషి చేశామని చెప్పారు.

చేవెళ్ల నుంచి 8 మంది ఎంపిక

చేవెళ్ల : జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా చేవెళ్ల మండలంలోని ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. మండలంలోని ఐదు మంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ముగ్గురు ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులు. మండలంలోని ఊరేళ్ల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, తంగడపల్లి జిల్లాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్‌లు, జిల్లాపరిషత్ గుండాల పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ శ్రీలత, జిల్లాపరిషత్ చేవెళ్ల పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ ఎస్. భూపాల్‌రెడ్డి, ప్రైవేటు పాఠశాలల నుంచి చేవెళ్లలోని సిల్వర్‌డేల్ పాఠశాలకు చెందిన జి. సునితారెడ్డిలు ఉన్నారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయుల నుంచి చేవెళ్ల పాఠశాల టి. కిరణ్ మహేందర్, దేవునిఎర్రవల్లి పాఠశాల బి. మంజులదేవి, కుమ్మెర పాఠశాలకు చెందిన శ్రీనివాస్‌రెడ్డిలు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

కొందుర్గు: గురుపూజా దినోత్సవం సందర్భంగా విశిష్ట సేవలందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ప్రభుత్వం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది. కొందుర్గు మండల కేంద్రంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉషశ్రీ, బాలుర ప్రాథమిక పాఠశాలకు చెందిన లక్ష్మీదేవిని ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు. అలాగే, జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిర ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీరాములు, వనంపల్లి పీఎస్ తులసికృష్ణ, వీరన్నపేట రాధిక, పెద్దఎల్కిచర్ల ఉన్నత పాఠశాలకు చెందిన సత్తయ్యలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరు మంగళవారం జిల్లా కలెక్టర్ హరీష్, విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు.

బాధ్యత పెరిగింది..



ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం చాలా సంతోషం. మరింత బాధ్యత పెరిగింది. నా జీవితాంతం విద్యార్థుల అభ్యున్నతికి పనిచేస్తా. పేద పిల్లలను విద్యాపరంగా ప్రోత్సహించేందుకు తగిన కృషి చేస్తా.

–ఉషశ్రీ, జీయూపీఎస్ కొందుర్గు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నదే నా అభిమతం. విద్యార్థులు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించేందుకు విద్యార్థులను ప్రోత్సహించాను. ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉంది.

–లక్ష్మీదేవి, బీపీఎస్ కొందుర్గు

విద్యార్థినులకు అండగా



యువకుల వేధిస్తున్న విద్యార్థినిలకు అండగా నిలిచి షీటీంతో వారికి రక్షణ కల్పించాను. విద్యార్థినిలకు అందిస్తున్న సేవలకు గాను గతంలో సీపీ సజ్జనార్ కూడా తనను అభినందించారు. విద్యార్థినిల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారికి అండగా నిలిచినందుకు ప్రభుత్వం గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

– జయమ్మ, జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, చించోడ్, షాద్‌నగర్

విద్యార్థులను ప్రోత్సహిస్తా



పేద విద్యార్థులను చదువుల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నాను. చదువు యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ వారిని విద్యలో ప్రేరేపించేలా కృషి చేస్తున్నాను. తాను చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించడం గర్వంగా ఉంది.

– శశికళ, ఎస్ఏ, కొత్తపేట, కేశంపేట

చాలా సంతోషంగా ఉంది



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావటం ఎంతో సంతోషంగా ఉంది. గత ఐదేళ్లుగా ఊరేళ్ల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నాను. గ్రామస్తులు, దాతల సహకారంతో పాఠశాలను ముందుకు తీసుకెళ్తున్నాం. జిల్లాపరిషత్ పాఠశాలల నుంచి ప్రతి సంవత్సరం ఉత్తమ విద్యార్థులుగా ఎంపిక అవుతున్నారు. తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులను ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు.

– గోపాల్, జిల్లాపరిషత్ ఊరేళ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు

సేవకు గుర్తింపు లభించింది



విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దేందుకు వినూత్న రీతిలో పాఠాలు బోధించడమే కాకుండా పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశాను. దాతల సహకారంతో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించాను. తాను చేసిన సేవలకు గుర్తింపు ఇవ్వడం సంతోషంగా ఉంది

– శ్రీనివాస్ సాగర్, స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్ కొత్తపేట, కేశంపేట

ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతా...



క్రీడల పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ కొందరు విద్యార్థులు ఆయా కారణాల వల్ల దూరంగా ఉంటున్నారు. అలాంటి వారికి నా వంతుగా అన్ని విధాలుగా సాయం చేస్తూ క్రీడల్లో నైపుణ్యాలు పెంచడానికి కృషి చేస్తున్నాను. అంతేకాకుండా క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు తెలియజేస్తున్నాం. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉంది.

– పుణ్యవతి, పీఈటీ, జెడ్పీహెచ్‌ఎస్, ఇన్ముల్‌నర్వ

బాధ్యత పెరిగింది



జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం బాధ్యత పెంచింది. ప్రభుత్వ పాఠశాలలు ఎందులో తక్కువ కాదనే ఆలోచనతో విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాను. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందితేనే భవిష్యత్తు ఉంటుంది.

–కిరణ్, చేవెళ్ల ప్రాథమికోన్నత పాఠశాల

వినూత్న బోధనకు గుర్తింపు



పేద విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు కృషి చేస్తున్నాను. విద్యార్థులకు సులభంగా అర్థం అయ్యేలా పాఠాలు బోధిస్తున్నాను.. వినూత్న బోధనకు గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

– శ్రీరాములు, ఎస్ఏ, జెడ్పీహెచ్‌ఎస్, ఎదిర

చదువు ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాం



ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు చదువు ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాం. చదువుకోకపోతే భవిష్యత్తులో ఎదుర్కొనే సమస్యలను సైతం వివరిస్తున్నాం. తరగతి గదిలో విద్యార్థులకు సులువుగా పాఠ్యాంశాలు అర్థమైయ్యేలా బోధన చేయడానికి కృషి చేస్తున్నా. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం ఎంతో సంతోషకరంగా ఉంది.

– గోప్య, ఉపాధ్యాయుడు, ప్రాథమిక పాఠశాల, కొత్తూరు

అవార్డు రావడం ఆనందం



అవార్డుకు ఎంపిక కావటం ఉపాధ్యాయ వృత్తిలో మరువలేనిది. చేసే వృత్తికి న్యాయం చేస్తున్నామనే దానికి ఈ అవార్డులు గుర్తు చేస్తుంటాయి. గ్రామీణ ప్రాంతంలో ఉండే పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు అందించేందుకు నిరంతరం కృషి చేస్తాను. ఉపాధ్యాయ వృత్తి అంటేనే ఎంతో గౌరవ ప్రదమైనది. ఇందులో తమ సేవలను గుర్తించి ఈ అవార్డులకు ఎంపిక చేయటం సంతోషంగా ఉంది.

–జి. శ్రీనివాస్‌రెడ్డి, .యుపిఎస్, కుమ్మెర